RNI NO : TELTEL/2023/88524

# మెదక్ టుడే

దిన పత్రిక

**నువ్వు చేసిన మంచి పని మనుషులు గుర్తించక పోవచ్చు, కాని దైవం మాత్రం అంతా గమనిస్తూనే ఉంటుంది. మంచికి మంచి, చెడుకు చెడు అనుభవించడానికి సిద్ధంగా ఉండాల్సిందే..!**

ఎడిటర్ : సిహెచ్. శివకుమార్ సంపుటి : 04 సంచిక : 224
గురువారం, జూలై 30, 2026, పేజీలు - 4 వెల : 2/-

# సారీ చెప్పను

## ఆయన్ను తప్పించాల్సిందే మోడీకి రాహుల్ డిమాండ్..!



**న్యూఢిల్లీ, జులై 29:** ఢిల్లీలో ఈ నెల 20న విద్యార్థులు చేపట్టిన పార్లమెంట్ మార్చ్ పై పోలీసుల బలప్ర యోగానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షాయే ఆదేశాలు ఇచ్చారంటూ లోక్ సభలో ఆరో పించిన విపక్ష నేత రాహుల్ గాంధీ తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నట్లు వెల్లడించారు. లోక్ సభలో తన వ్యాఖ్యలపై బీజేపీ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తుండగానే స్పీకర్ సభను వాయిదా వేయడం, తిరిగి రాగానే పేపర్ లీక్ ల నిరోధక బిల్లును మూజువాణి ఓటుతో కేంద్రం ఆమోదింపజేసుకోవడంపై రాహుల్ మండిపడ్డారు. లోక్ సభలో తనను మాట్లాడే అవకాశం కల్పించలేదని ఆరోపిస్తూ.. సాయంత్రం ప్రెస్ మీట్ కమ్ ప్రజంటేషన్ ఏర్పాటు చేసిన రాహుల్ గాంధీ.. హోం మంత్రి అమిత్ షాను పదవి నుంచి తొలగించాలని ప్రధాని నరేంద్ర మోదీకి మరోసారి పిలుపునిచ్చారు. క్షమాపణ చెబితే తన ప్రసంగాన్ని కొనసాగించడానికి అనుమతిస్తారని తనకు హామీ లభించిందని విపక్ష నేత రాహుల్ పేర్కొన్నారు. కానీ తాను బీజేపీకి గానీ, ఆర్ఎస్ఎస్‌కు గానీ ఎప్పటికీ క్షమాపణ చెప్పబోనని స్పష్టం చేశారు.

## హైడ్రాపై మంత్రి ఉత్తమ్ కీలక వ్యాఖ్యలు



**ఢిల్లీ, జులై 29 :** హైడ్రాపై తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. హైడ్రా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దగ్గర ఉన్న శాఖనని.. వారే దానిపై నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. హైడ్రాపై ముఖ్యమంత్రి మాట్లాడిన తర్వాత తాను మాట్లాడటం సబబు కాదని చెప్పుకొచ్చారు. మున్సిపల్ శాఖ సీఎం పరిధిలోనే ఉందని, ఆయనే నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు. ఈనెల 31న ఎన్డీఎస్ఏ సమావేశంకాళేశ్వరంపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సమావేశం ఈనెల 31వ తేదీన నిర్వహిస్తామని పేర్కొన్నారు. సీడబ్ల్యూసీ, తెలంగాణ ప్రభుత్వంతో ఈ సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈరోజు (బుధవారం) ఢిల్లీ వేదికగా మీడియాతో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. కాళేశ్వరంపై ఎలా ముందుకెళ్లాలనే విషయంపై ఈ సమావేశంలో చర్చిస్తామని అన్నారు. ఎన్డీఎస్ఏ అధికారులు లిఖితపూర్వకంగా ఇచ్చే సూచనల ప్రకారం ముందుకెళ్తామని స్పష్టం చేశారు. మూడు బ్యారేజ్‌లను టెస్టింగ్ చేస్తున్నాం..కాళేశ్వరంపై అంతర్జాతీయ నిపుణులతో, ఎన్డీఎస్ఏ అధికారులతో చర్చిస్తున్నామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. మూడు బ్యారేజ్‌లను టెస్టింగ్ చేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఐఐటీ బాంబే, ఆఫ్రో ఇండియాతో రిహబిలిటేషన్ డిజైన్స్ వర్క్ పూర్తి చేస్తామని వెల్లడించారు.
వీలైనంత త్వరగా మరమ్మతులు చేపడతామని తెలిపారు.

## ఏపీని బ్యాన్ చేసిన సీఎం విజయ్

### రంగంలోకి కేరళ ముఖ్యమంత్రి!



**తమిళనాడు:** ఇరుగుపొరుగు రాష్ట్రాలకు తమిళనాడు ప్రభుత్వం ఊహించని షాక్ ఇచ్చింది. తమ రాష్ట్రంలో పెరుగుతున్న భవన నిర్మాణ, మౌలిక వసతుల అవసరాలను సాకుగా చూపిస్తూ.. రాళ్లు, ఎమ్-శాండ్, మెటల్ జెల్లీ వంటి కీలక నిర్మాణ సామగ్రిని ఇతర రాష్ట్రాలకు తరలిం చడంపై మూడు నెలల పాటు కఠిన నిషేధం విధిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. సరిహద్దుల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ రాష్ట్రాలపై ఈ నిర్ణయ ప్రభావం తీవ్రంగా పడనుండగా.. పుదుచ్చేరి, కారైకాల్ ప్రాంతాలకు మాత్రం మినహాయింపునిచ్చారు. రాష్ట్రంలో పట్టణీకరణ వేగంగా పెరుగుతుండటంతో పాటు భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులు, గృహ నిర్మాణాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో రోజురోజుకూ పెరుగుతున్న డిమాండ్‌కు సరిపడా రాతి ఉత్పత్తులు తమిళనాడులోని క్వారీల నుంచి లభించడం లేదని ప్రభుత్వం తెలిపింది. ఇక్కడి నుంచి పొరుగు రాష్ట్రాలకు భారీగా సామగ్రి తరలిపోవడం వల్ల స్థానికంగా కృత్రిమ కొరత ఏర్పడి, ధరలు ఆకాశాన్నంటుతున్నాయని అధికార వర్గాలు అభిప్రాయపడ్డాయి. స్థానిక ప్రాజెక్టులు ఆగిపో కుండా చూడటానికే ఈ తాత్కాలిక కట్టుదిట్టమైన పేర్కొంది.

## ‘సర్’ ప్రక్రియను వేగవంతం చేయాలి


### : భట్టి విక్రమార్క



**ఢిల్లీ, జులై 29 :** ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియను కాంగ్రెస్ బీఎల్ఏలు వేగవంతం చేయాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేసేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. ఎమ్మెల్సీ గ్రాడ్యుయేషన్ ఎలక్షన్‌పై జిల్లా ఇన్‌చార్జ్, జిల్లా పీసీసీలతో చర్చించి ముగ్గురు సభ్యులతో ప్యానల్ ఏర్పాటు చేసి నివేదిక అందించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండాలని సూచించారు. బీఎల్ఏలు బాగా పనిచేస్తున్నారని అభినందించారు. ఏఐసీసీ కార్యాలయంలో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం ఈరోజు జరిగిందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ‘సర్’ ప్రక్రియ దురుద్దేశంతో జరుగుతుంది: మహేశ్ కుమార్ గౌడ్ ‘సర్’పై రివ్యూ చేశామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. 36 వేల మంది బీఎల్ఏ నియమించినట్లు చెప్పారు. 50 నుంచి 60 శాతం ఈ ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. రెండు, మూడు రోజుల్లో వందశాతం పూర్తవుతుందని వివరించారు. అర్హతగల ఓటర్ల ఓటు హక్కు కాపాడటం తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఈసారి ‘సర్’ ప్రక్రియ దురుద్దేశంతో జరుగుతుందని చెప్పారు. ఓట్లను కాపాడే ఉద్దేశంతో ఈ సమావేశంలో చర్చించామని తెలిపారు. సంస్థాగత బలోపేతం, పార్టీ ప్రభుత్వ సమన్వయంపై మాట్లాడామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఢిల్లీలో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం..కాగా, ఢిల్లీ ఇందిరా భవన్‌లో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం ఈరోజు (బుధవారం) జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ , మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , సీతక్క , సీడ బ్ల్యూసీ సభ్యులు మంత్రి దామోదర్ రాజానర్సింహ, వంశీ చంద్ పాల్గొన్నారు. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. తెలంగాణలో ‘సర్’ ప్రక్రియ, పార్టీ – ప్రభుత్వం మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంపై ప్రధానంగా చర్చించారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఏర్పాటు చేసిన కోఆర్డినేషన్ కమిటీ పనితీరు, ఇప్పటి వరకు తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్షించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ కార్యక్రమాల సమన్వయం, ప్రజలకు చేరువ చేసే కార్యాచరణపై మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, సంస్థాగత బలోపేతం, చర్చించినట్లు సమాచారం.

## కల్వకుంట్ల కవిత కారుపై

## భారీగా ట్రాఫిక్ చలాన్లు..



**హైదరాబాద్:** టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కారుపై భారీగా ట్రాఫిక్ చలాన్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఆమె కారుపై మొత్తం 25 ట్రాఫిక్ చలాన్లు పెండింగ్‌లో ఉన్నట్లు ఈ-చలాన్ ద్వారా తెలుస్తోంది. ఇక ఈ 25 ట్రాఫిక్ చలాన్ల మొత్తం రూ.21,875గా ఉన్నట్లు తేలింది. ఈ ట్రాఫిక్ ఉల్లంఘనల్లో ఎక్కువ భాగం ఓవర్‌స్పీడింగ్‌కు సంబంధించినవే ఉండటం గమనార్హం. ఫ్యాన్సీ నంబర్ ప్లేట్ వినియోగం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా పార్కింగ్ చేసినందుకు కూడా చలాన్లు నమోదయ్యాయి. వాహనాలు ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడితే.. ట్రాఫిక్ పోలీసులు చలాన్లు విధించడం సర్వసాధారణమే. ఓవర్ స్పీడ్, సిగ్నల్ జంపింగ్, రాంగ్ పార్కింగ్ వంటి ట్రాఫిక్ రూల్స్‌ను ఉల్లంఘించిన వాహనదారుల నంబర్ ప్లేట్ల ఆధారంగా ట్రాఫిక్ చలాన్లు వేస్తూ ఉంటారు. ఇక వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించేందుకు ఈ ఫైన్లను భారీగా రాష్ట్ర ప్రభుత్వం పెంచేసింది. అయినప్పటికీ వాహనదారుల్లో మార్పు రావడం లేదు. పదే పదే ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడుతూ.. ఫైన్లు పడేలా చేసుకుంటున్నారు.

## ‘విద్యార్థుల నిరసనపై కేంద్రం మూర్ఖంగా వ్యవహరించింది’..

### – లోక్‌సభలో రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ, జులై 29:** లోక్‌సభలో యాంటీ పేపర్ లీక్ బిల్లుపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బిల్లుపై మాట్లాడుతూ.. పేపర్ లీక్‌పై ఏం జరిగిందో తెలుసుకోవాలంటే బీజేపీ నేతలు, వారి పిల్లలను అడగాలంటూ వ్యాఖ్యానించారు. ఢిల్లీ వీధుల్లో జరిగింది నిరసన కాదని.. భావ వ్యక్తీకరణ అని పేర్కొన్నారు. విద్యార్థులు శాంతియుతంగా ఆందోళన చేశారని తెలిపారు. విద్యార్థుల ఆందోళనను దేశ ప్రజలు అర్థం చేసుకున్నారని అన్నారు. విద్యార్థుల ఆందోళనను రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు గౌరవించాలని రాహుల్ పిలుపునిచ్చారు. తీవ్ర వేదన తర్వాతే విద్యార్థులు ఆందోళన చేశారని.. కానీ వారి నిరసనను కేంద్రం అర్థం చేసుకోలేదని విమర్శించారు. వారి ఆవేదనను పట్టించుకోలేదనే విద్యార్థులు రోడ్లపైకి వచ్చారని వివరించారు. విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేసి, హింసించారని మండిపడ్డారు. పేపర్ లీక్ వార్తతో విద్యార్థులు తీవ్ర ఆవేదనకు గురయ్యారని.. వారి ఆవేదనను అర్థం చేసుకున్నందునే వారి పక్షాన మాట్లాడుతునట్లు రాహుల్ గాంధీ చెప్పుకొచ్చారు. రాహుల్ ప్రసంగంపై బీజేపీ ఎంపీల అభ్యంతరం..లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. విద్యార్థుల ఆందోళన అంశంపై సభలో ప్రసంగించిన ఆయన.. ఆర్ఎస్ఎస్, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపయోగించిన ఓ పదం వివాదాస్పదంగా మారింది. దీనిపై అధికార పక్ష ఎంపీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ సభలో నిరసన తెలిపారు.

## ప్రజల భద్రతతోపాటు వన్యప్రాణుల సంరక్షణే లక్ష్యం

### : పవన్ కల్యాణ్



**అమరావతి, జులై 29:** ప్రజల భద్రతతోపాటు వన్యప్రాణుల సంరక్షణకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు. బుధవారం గుచ్చిమి కుంకీ ఏనుగుల శిబిరాన్ని వర్చువల్‌గా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. దశాబ్దాల నుంచి నెలకున్న మానవ – ఏనుగు సంఘర్షణలకు శాస్త్రీయ పరిష్కారంగా గుచ్చిమి ఎలిఫెంట్ క్యాంప్ ఏర్పాటు చేశామన్నారు. ఆధునిక సాంకేతికతతో మన్యంలో అటవీ ఏనుగుల సమస్యకు పరిష్కారం దొరికిందని తెలిపారు. ఇది రైతుల పంటలు, ప్రజల ప్రాణాల రక్షణకు కీలక ముందడుగు అని అభివర్ణించారు. అటవీ ప్రాంతం నుంచి ఏనుగులు గ్రామాల్లోకి ప్రవేశించి పంటలు ధ్వంసం చేయడంతో ప్రజలు భయాందోళనల మధ్య జీవిస్తున్నారని చెప్పారు. పార్వతీపురం మన్యం జిల్లాలో చాలా కాలంగా ఈ ఇబ్బందులు ఉన్నాయని అన్నారు. ఉత్తరాంధ్రలో పర్యటిస్తున్నప్పుడు స్థానిక ప్రజలు ఈ సమస్యను తన దృష్టికి తీసుకొచ్చారని గుర్తు చేసుకున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం ప్రభుత్వ బాధ్యతగా భావించి.. గుచ్చిమి ఎలిఫెంట్ హోల్డింగ్ ఏరియాను ఏర్పాటు చేశామని వివరించారు. ఉత్తరాంధ్రలో మానవ – ఏనుగు సంఘర్షణల నివారణలో ఈ కేంద్రం ఓ కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని ఏపీ డిప్యూటీ సీఎం తెలిపారు. మనుషులు, ఏనుగులు మధ్య సామరస్య జీవనానికి వేదికగా ఈ గుచ్చిమి ఏనుగుల క్యాంప్ నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అందుకే దీనిని ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అంకితం చేస్తున్నానని చెప్పారు. కర్ణాటక ప్రభుత్వం, అక్కడి ప్రజలు అందించిన సహకారం మరువలేనిదని అన్నారు. మన విజ్ఞప్తిని గౌరవించి, ఎంతో ఆప్యాయతతో నాలుగు కుంకీ ఏనుగులను మన రాష్ట్రానికి పంపించడం వారి గొప్ప మనసు, స్నేహభావానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఏనుగులను ఇవ్వడం అనేది సంపద ఇచ్చినట్లుగా అక్కడ ప్రజలు భావిస్తారని వివరించారు. అయినా తెలుగు ప్రజల రక్షణ కోసం ప్రేమతో కుంకీ ఏనుగులను మన రాష్ట్రానికి పంపించిన కర్ణాటక ప్రభుత్వంతోపాటు ఆ రాష్ట్ర ప్రజలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంఛార్జ్ మంత్రి కె.అచ్చెన్నాయుడు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణితోపాటు పాల్గొన్నారు.

## భారత్, చైనాపై 100 శాతం సుంకాలు..

### రష్యాపై ఆంక్షల బిల్లుకు అమెరికా సెనెట్ ఆమోదం..




**అమెరికా:** రష్యాపై మరింత కఠిన ఆర్థిక ఆంక్షలు విధించే కీలక బిల్లుకు అమెరికా సెనెట్ ఆమోదం తెలిపింది. ఈ బిల్లు అమల్లోకి వస్తే, రష్యా నుంచి భారీగా చమురు, సహజ వాయువు కొనుగోలు చేస్తున్న భారత్, చైనా వంటి దేశాలపై 100 శాతం వరకు దిగుమతి సుంకాలు విధించే అధికారం అమెరికా అధ్యక్షుడికి లభించనుంది ఈ బిల్లును దివంగత సెనెటర్ లిండ్సే గ్రాహమ్, డెమోక్రటిక్ సెనెటర్ రిచర్డ్ బ్లూమెంటాల్ కలిసి రూపొందించారు. సెనెట్‌లో జరిగిన ఓటింగ్‌లో బిల్లుకు 86-12 ఓట్లతో మద్దతు లభించింది. అయితే ఇది ఇంకా పూర్తిస్థాయి చట్టం కాలేదు. సెనెట్‌లో మరిన్ని దశలు పూర్తి చేసిన తర్వాత ప్రతినిధుల సభ ఆమోదం పొందాలి. అనంతరం అధ్యక్షుడి సంతకం జరిగితే ఇది చట్టంగా మారుతుంది ప్రస్తుతం రష్యా నుంచి భారత్ గణనీయంగా ముడి చమురు దిగుమతి చేసుకుంటోంది. కొత్త బిల్లు ప్రకారం, రష్యా నుంచి ఇంధన కొనుగోళ్లు కొనసాగించే ప్రధాన దేశాలపై గరిష్ఠంగా 100 శాతం టారిఫ్‌లు విధించే అవకాశం ఉంటుంది. అయితే ఈ టారిఫ్‌లను ఎప్పుడు, ఏ దేశంపై, ఎంత మేరకు అమలు చేయాలన్న తుది నిర్ణయం అమెరికా అధ్యక్షుడి పరిధిలో ఉంటుంది రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ఆర్థిక వనరులు అందకుండా చేయడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశమని అమెరికా చెబుతోంది.

# చందాయిపేట రైతు వేదికలో విత్తనాల మేళ ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన





**చేగుంట, జూలై 28, మెదక్ టుడే న్యూస్**

చేగుంట మండలంలోని చందాయిపేట రైతు వేదికలో "విత్తనాల మేళ"లి నిర్వహించారు. ఈకార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరైనారు వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎల్-నినో ప్రభావం కారణంగా వర్షపాతం అనిశ్చితంగా ఉన్నందున రైతులు వరి సాగు చేయవద్దని సూచించారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటి అవసరమున్న పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు, నూనె గింజలు, కూరగాయ పంటలు,సాగు చేయాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా ప్రభుత్వం ఆయిల్ పామ్ పంటను సాగు చేసుకునేందుకు సబ్సిడీ రూపంలో ప్రోత్సాహకాలు అందిస్తుందని రైతులకు తెలియజేశారు. ఈ మేళాలో భాగంగా మండలంలోని విత్తన డీలర్లు చందాయిపేట రైతు వేదికలో పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు మరియు కూరగాయ విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచారు. ఈ కార్యక్రమంలో చందాయిపేట సర్పంచ్ తాలూకా మహేశ్వరి సాయిబాబా,మండల వ్యవసాయ అధికారి హరి ప్రసాద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు మోజామిల్,అన్నం ఆంజనేయులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, విత్తన డీలర్లు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# గురుపౌర్ణమి వేడుకల్లో ఘనంగా శ్రీ షిర్డీ సాయిబాబా ప్రత్యేక పూజలు

**- పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శాపురం నరసింహారెడ్డి దంపతులు**



**పటాన్ చెరు, జులై 29:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ముత్తంగి డివిజన్ పరిధిలోని కార్ధనూర్ గ్రామంలో వెలసిన శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శాపురం నరసింహారెడ్డి మరియు వారి సతీమణి సునంద రెడ్డి కుటుంబ సమేతంగా ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాపురం నరసింహారెడ్డి మాట్లాడుతూ.. సాయిబాబా చూపిన బాటలో ప్రతి ఒక్కరూ శాంతి, సమానత్వం, దయతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. భగవంతుని ఆశీస్సులతో ముత్తంగి డివిజన్‌లోని ప్రతి గ్రామం, ప్రతి పేద కుటుంబం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని బాబాను వేడుకున్నట్లు తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక హారతి, భజన కార్యక్రమాలను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు రాంప్రసాద్, దుర్గేష్, కోమటి సంతోష్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, స్థానిక భక్తులు పాల్గొన్నారు. పూజల అనంతరం భక్తులకు మహా ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

# 5,000 మందికి అన్నదానం అంటే సాధారణ విషయం కాదు: షిరిడి సాయి కాలనీలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

**- ఆలయ చైర్మన్ బోయిని బాలరాజ్**





**అమీన్ పూర్, జూలై 29:మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**

అమీన్ పూర్ జీహెచ్ఎంసీ పరిధిలోని బీరంగూడ డివిజన్ పరిధిలోని షిరిడి సాయి కాలనీలో శ్రీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగాయి. ఆలయ చైర్మన్ బోయిని బాలరాజ్ మరియు ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ బోయిని బాలరాజ్ మీడియాతో మాట్లాడుతూ..."మా కాలనీలో సాయిబాబా టెంపుల్ కట్టుకొని సుమారు 22 సంవత్సరాలు అవుతోంది. ఇక్కడ ప్రతి ఏటా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నాము. నేడు గురుపౌర్ణమి సందర్భంగా సుమారు 5,000 మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారంటే అది సాధారణ విషయం కాదు, బాబా కృపతోనే ఇది సాధ్యమైందిఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లను ఏర్పాటు చేశాము. కమిటీ మెంబర్స్ అందరూ దగ్గరుండి భక్తుల దర్శనానికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా పర్యవేక్షించారు. అలాగే ఈరోజు సాయంత్రం 6 గంటలకు స్వామివారికి ఘనంగా పల్లకి సేవ ఉంటుంది. కాలనీ చుట్టుముట్టూ పల్లకి సేవ సాగుతుంది కాబట్టి, భక్తులందరూ పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని సాయిబాబా కృపకు పాత్రులు కావాలని కోరుకుంటున్నాను," అని ఆయన తెలిపారు. బాబా సన్నిధిలో జరిగిన ఈ మహా అన్నదాన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వందలాది మంది భక్తులు స్వచ్ఛందంగా పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను ఘనంగా పర్యవేక్షించారు.

# అంగన్‌వాడీ పోస్టులకు భారీ స్పందన

**- కొల్చారం, పాపన్నపేట మండలాల్లో 186 దరఖాస్తులు..**

**-102 మంది సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కు హాజరు**



**మెదక్ టుడే న్యూస్ జులై 29:**-మెదక్ జిల్లా ప్రతినిధి పి. దుర్గేష్ గౌడ్ మెదక్ పట్టణంలోని సిడిపిఓ కార్యాలయంలో ఖాళీగా ఉన్న అంగన్ వాడీ పోస్టులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించినట్లు మెదక్ సీడీపీఓ వెంకటరమణమ్మ తెలిపారు. మెదక్ ప్రాజెక్టు పరిధిలోని కొల్చారం, పాపన్నపేట మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా నిర్వహించిన వెరిఫికేషన్ కు అభ్యర్థుల నుంచి మంచి స్పందన లభించింది. మొత్తం 5 పోస్టులకు 186 మంది దరఖాస్తు చేయగా, 102 మంది వెరిఫికేషన్ కు హాజరైనట్లు సీడీపీఓ తెలిపారు. కొల్చారం మండలంలోని 2 పోస్టులకు 74 మంది దరఖాస్తు చేసుకోగా, 38 మంది హాజరయ్యారు. పాపన్నపేట మండలంలోని 3 పోస్టులకు 112 మంది దరఖాస్తు చేయగా, 64 మంది వెరిఫికేషన్ కు హాజరయ్యారు. భర్తీ జరుగుతున్న ఖాళీల్లో కొల్చారం మండలంలోని రంగంపేట--2, కొంగోడ్ సెంటర్--2, పాపన్నపేట మండలంలోని కొత్తపల్లి సెంటర్--2, అర్కెల సెంటర్--2, లక్ష్మీనగర్ తండా అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని సీడీపీఓ వెంకటరమణమ్మ వెల్లడించారు.

# బీరంగూడ గుట్టపై అత్యంత వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు.. ప్రధాన అర్చకులకు ఘన సన్మానం!





**అమీన్‌పూర్, జులై 29:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బీరంగూడ గుట్టపై వెలసిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి దివ్య సన్నిధిలో గురుపౌర్ణమి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు. ఈ పవిత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది. గురువులదే ప్రథమ స్థానం: ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శ్రీ సుధాకర్ యాదవ్ గురుపౌర్ణమి విశిష్టతను మీడియాకు వివరించారు. "భారతీయ సంస్కృతిలో తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువులదేనని, గురువును దైవంతో సమానంగా భావించి పూజించడం మన హైందవ సంప్రదాయం" అని ఆయన పేర్కొన్నారు. గురువులు చూపిన సన్మార్గంలో నడుస్తూ ప్రతి ఒక్కరూ సమాజానికి మంచి మార్గదర్శకత్వం అందించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ప్రధాన అర్చకుల సన్మానం: వేడుకల్లో భాగంగా ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్, ఆలయ అధికారులు మరియు కమిటీ సభ్యులు అందరూ కలిసి ప్రధాన అర్చకులు శ్రీ రాధాకృష్ణ గారి,ప్రహ్లాద్ గారి ని ఘనంగా సన్మానించి, శాలువాలు కప్పి వారి దివ్య ఆశీస్సులు తీసుకున్నారు. ప్రత్యేక పూజలు: ఆలయంలో ప్రహ్లాద్ గారి ఆధ్వర్యంలో గురు పూజలు, రుద్రాభిషేకాలు అత్యంత నిష్టతో జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీర్వాదాలు పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు మల్లికార్జున్ రెడ్డి, ఆలయ కమిటీ మెంబర్స్ చంద్రశేఖర్, శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రమేష్ యాదవ్, గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః ।గురుః సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః ॥ ఈ గురుపౌర్ణమి పర్వదినాన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి కృపతో పాటు గురువుల ఆశీస్సులు ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలను, ఐశ్వర్యాలను నింపాలని కోరుకుంటూ.. సర్వేజనా సుఖినో భవంతు!

# ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు



**మెదక్ టుడే న్యూస్ జులై 29:-** మెదక్ జిల్లా ప్రతినిధి పి దుర్గేష్ గౌడ్ పాపన్నపేట, మండల కేంద్రం పాపన్నపేటలో గురు పౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో సాయిబాబా స్వామివారికి 108 లీటర్ల ఆవు పాలతో ఘనంగా అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారిని పట్టు వస్త్రాలు, వివిధ రకాల పూలమాలలు, కిరీటంతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. పూజారి విశ్వనాథ శర్మ ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా స్వామివారు భక్తులకు శోభాయమానంగా దర్శనమిచ్చారు. గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. అనంతరం భక్తుల కోసం కొత్త విశాంత్ గుప్తా ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు సాయిబాబా నామస్మరణ చేస్తూ ఆధ్యాత్మిక వాతావరణంలో గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

# గురువు చూపిన మార్గంలో నడవడం, సమాజానికి సేవే నిజమైన గురుదక్షిణ



**( స్పెషల్ కరస్పాండెంట్ ) షాద్నగర్,జూలై,29,మెదక్ టుడే న్యూస్:** గురు పౌర్ణమి సందర్భంగా షాద్‌నగర్ షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డివేదవ్యాస మహర్షి, గురుపరంపరను స్మరించుకుంటూ,ఆమె మాట్లాడుతూ,గురు పౌర్ణమి భారతీయ సంస్కృతిలో గురువుల పట్ల కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేసే అత్యంత పవిత్రమైన పర్వదినమని అన్నారు. జ్ఞానాన్ని అందించి సమాజ నిర్మాణానికి దోహదపడే గురువుల సేవలు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ గురువులను గౌరవిస్తూ వారు. చూపిన సన్మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. సద్గురు సాయిబాబా బోధించిన 'శ్రద్ధా -- సబూరి' సూత్రాలు ప్రతి ఒక్కరి జీవితానికి మార్గదర్శకాలని పేర్కొంటూ, ప్రేమ, సేవ, త్యాగం, మానవత్వం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి.





**మెదక్ టుడే న్యూస్ జులై 29:**-మెదక్ జిల్లా ప్రతినిధి పి దుర్గేష్ గౌడ్ పాపన్నపేట మండలం రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన మండల పరిధిలోని లక్ష్మీనగర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు ...యూసుఫ్ పేట గ్రామానికి చెందిన బోల వెంకటేశం(42) వ్యవసాయం చేసుకుంటూ జీవితం గడుపుతున్నాడు. మంగళవారం సాయంత్రం కూరగాయల తీసుకురావడానికి ఇదే గ్రామానికి చెందిన రవితో కలిసి తన టీవీఎస్ ఎక్సెల్ పై పొడిచన్ పల్లి గేటు వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా లక్ష్మీనగర్ గ్రామ శివారులోనికి రాగానే వెనక వైపు నుంచి వచ్చిన బొలెరో ట్రాలీ వాహనం డీకొట్టడంతో కింద పడ్డారు. తీవ్ర గాయాలతో ఉన్న వారిని స్థానికుల సహాయంతో చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించగా అక్కడ డాక్టర్లు గమనించి వెంకటేశం అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు .మృతుడి భార్య శోభ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు

# పార్టీ నియమాలను అనుసరించాలి

**- మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో 50 కుటుంబాలు టిడిపిలో చేరిక**





**విజయనగరం, జులై 29** తెలుగుదేశం పార్టీలో చేరిన ప్రతి ఒక్కరు కూడా పార్టీ నియమాలను అనుసరించాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. విజయనగరంలోని మంత్రి గారి క్యాంప్ కార్యాలయం నందు బుధవారం గజపతినగరం నియోజకవర్గ బొండపల్లి మండలం మరువాడ కొత్తవలస గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు 50 కుటుంబాల వారు మంత్రి కొండపల్లి శ్రీనివాస్, నియోజకవర్గ పరిశీలకులు వలవల బాబ్జి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన తెలుగుదేశం పార్టీలో ప్రతి ఒక్కరు నిబద్ధత పనిచేయాలని, తెలుగుదేశం పార్టీ నాయకుల సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. వైసీపీ సీనియర్ నాయకులు కోరాడ సత్యనారాయణ, మాజీ వార్డ్ మెంబర్ పల్లి సత్యం వారి అనుచరులతో కలిసి తెలుగుదేశం పార్టీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొండపల్లి కొండల రావు గారు, టిడిపి మండల ప్రెసిడెంట్ రాపాక అచ్చం నాయుడు, మాజీ సర్పంచ్ కర్రోతు , టిడిపి గ్రామ ప్రెసిడెంట్ పెన్నింటి తవుడు తదితరులు పాల్గొన్నారు.

## గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు గారినీ కలసిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**విజయనగరం, జులై 29,**
గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు గారిని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు గవర్నర్ బంగ్లాలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అరగంటకు పైగా ఇష్టాగోష్టి నిర్వహించారు. భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం కావడం సంతోషంగా ఉందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేసిన, మీరు పునాది వేసిన భోగాపురం ఎయిర్పోర్ట్ తమరి కల మరో రెండు రోజులలో సాకారం కావడం చాలా ఆనందాన్ని కలిగిస్తుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విమానయాన రంగంలో జిఎంఆర్ సంస్థకు మంచి అనుభవం ఉందని, త్వరితగతిన పూర్తి చేసిన జిఎంఆర్ సంస్థకు గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు గారు అభినందనలు తెలిపారు. విమానాశ్రయానికిప్రభుత్వం అల్లూరి సీతారామరాజు నామకరణం చేయటం శుభ పరిణామం అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ గారు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు ప్రారంభించడం బాగున్నదన్నారుపరిశ్రమలు, రవాణా వ్యవస్థ బాగుంటే ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని ఆ దిశగా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని గవర్నర్ సూచించారు. ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గారు తదితరులు పాల్గొన్నారు.

## చెల్లూరు హైవే జంక్షన్ ప్రాంతాన్ని పరిశీలించిన మంత్రుల బృందం



**విజయనగరం, జులై 29,**
ప్రధాని నరేంద్ర మోడీ గారి సభ సమావేశానికి వచ్చి తిరిగి వెళ్లే ప్రజానీకానికి భోజనాలు ఏర్పాటు చేయడం కోసం చెల్లూరు హైవే జంక్షన్ ప్రాంతాన్ని బుధవారం సాయంత్రం మంత్రులు బృందం పరిశీలించారు. మంత్రులు అచ్చం నాయుడు, అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్ధన రెడ్డి, కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి, దామచర్ల సత్య, బీద రవిచంద్ర, కిలారు రాజేష్, కోటంరెడ్డి గిరిధర్ గార్లు కలిసి హైవే జంక్షన్ ప్రాంతాలను పరిశీలించారు. జంక్షన్ ప్రాంతంలో ఉన్న ఖాళీ స్థలంలో ఎక్కువ మంది ప్రజలు భోజనాలు చేసేందుకు వీలు కల్పించి తగిన ఏర్పాట్లు చేయటానికి పరిశీలన జరిపినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో సుమారు 20 వేల మంది భోజనాలు చేయటానికి వీలు పడుతుందనే అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. మంత్రుల బృందం, అధికారులు తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని తెలిపారు.

# అంతర్రాష్ట్ర చైన్ స్నాచింగ్ ముఠా గుట్టురట్టు

**ముగ్గురు నిందితుల అరెస్ట్**
**-- 7 తులాల బంగారం, బైక్, సెల్‌ఫోన్లు స్వాధీనం**
**- ఫ్యూచర్ సిటీ కమిషనర్ డా. తరుణ్ జోషి వెల్లడి**
**- కేశంపేట, కడ్తాల్, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో వరుస చైన్ స్నాచింగ్‌లకు తెరదించిన పోలీసులు**
**- చోరీ చేసిన ద్విచక్ర వాహనంతోనే నేరాలకు పాల్పడిన నిందితులు**
**- కేశంపేట ఎక్స్‌రోడ్డు వద్ద పోలీసులు చాకచక్యంగా అదుపులోకి**





**(స్పెషల్ కరస్పాండెంట్)షాద్‌నగర్,జూలై,29,మెదక్ టుడే న్యూస్:**
కేశంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల వరుసగా చోటుచేసుకున్న చైన్ స్నాచింగ్ ఘటనలను ఛేదించిన పోలీసులు అంతర్రాష్ట్ర నేర ముఠాకు చెందిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి సుమారు 7 తులాల బంగారు ఆభరణాలు, మూడు మొబైల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి వెల్లడించారు.
షాద్‌నగర్ డీసీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో డీసీపీ శిరీషా రాఘవేంద్ర, ఏసీపీ ఎస్. లక్ష్మీనారాయణ, కేశంపేట సీఐ బి. నరహరి తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.
? పంజాబ్‌కు చెందిన ముఠా సభ్యులు
పోలీసుల కథనం ప్రకారం.. పంజాబ్ రాష్ట్రానికి చెందిన సుఖ్‌దేవ్ సింగ్ (38), షమ్షేర్ సింగ్ (36), మన్‌ప్రీత్ సింగ్ (24) హార్వెస్టర్ డ్రైవర్లు, కూలీలుగా పనిచేస్తూ తెలంగాణ గ్రామీణ ప్రాంతాలపై పూర్తి అవగాహన పెంచుకున్నారు. స్థానిక రహదారులు, గ్రామాల మార్గాలు, తప్పించుకునే దారులను గుర్తించి సులభంగా నేరాలకు పాల్పడేందుకు ప్రణాళిక రూపొందించినట్లు విచారణలో తేలింది.
వృద్ధురాలిని లక్ష్యంగా చేసుకుని దారుణం
జూలై 25న కేశంపేట మండలం సంతాపూర్ గ్రామ శివారులో మనవరాలితో కలిసి వెళ్తున్న ఓ వృద్ధురాలిని లక్ష్యంగా చేసుకున్న నిందితులు దారి అడుగుతున్నట్లు నటించి, ఒక్కసారిగా ఆమె మెడలోని 4 తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని పరారయ్యారు.అదే రోజు కడ్తాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరో మహిళను బెదిరించి కిందకు నెట్టివేసి ఆమె మెడలోని 3 తులాల బంగారు పుస్తెలతాడును అపహరించినట్లు పోలీసులు వెల్లడించారు.
? చోరీ చేసిన బైక్‌తోనే వరుస నేరాలు
జూన్ నెలలో కొత్తకోట ప్రాంతంలో ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసిన నిందితులు, అదే బైక్‌ను ఉపయోగించి చైన్ స్నాచింగ్‌లకు పాల్పడినట్లు విచారణలో అంగీకరించారు.దోచుకున్న బంగారు ఆభరణాలను విక్రయించి వచ్చిన నగదును పరస్పరం పంచుకున్నట్లు వెల్లడైంది.
జూలై 23న నాందేడ్ నుంచి సికింద్రాబాద్‌కు రైలులో చేరిన నిందితులు, అనంతరం జూలై 24న మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్ సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎం వద్ద పార్క్ చేసిన హోండా సీడీ--100 ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసి, దానితో కేశంపేట, కడ్తాల్ ప్రాంతాల్లో నేరాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.
? మరో నేరానికి సిద్ధమవుతుండగా అరెస్ట్
విశ్వసనీయ సమాచారం మేరకు జూలై 29న కేశంపేట ఎక్స్‌రోడ్డు వద్ద మరో చైన్ స్నాచింగ్‌కు సిద్ధమవుతున్న సమయంలో ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో కేశంపేట, కడ్తాల్, మహబూబ్‌నగర్ టౌన్, కొత్తకోట పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన పలు కేసుల్లో తమ ప్రమేయాన్ని నిందితులు అంగీకరించినట్లు వెల్లడైంది.
పోలీసు బృందానికి కమిషనర్ అభినందనలు
ఈ కేసును విజయవంతంగా ఛేదించిన పోలీసు బృందాన్ని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి అభినందించారు. ఆయన పర్యవేక్షణలో డీసీపీ శిరీషా రాఘవేంద్ర, ఏసీపీ ఎస్. లక్ష్మీనారాయణ, కేశంపేట సీఐ బి. నరహరి, ఎస్ఐ టి. రాజ్‌కుమార్, కేశంపేట పోలీసు సిబ్బంది, జోనల్ క్రైమ్ టీమ్ సమన్వయంతో ఈ కేసును ఛేదించినట్లు తెలిపారు.
ప్రజలకు పోలీసుల సూచనలు
అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
నివాస ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేయడం ద్వారా నేరాల నియంత్రణకు సహకరించాలి.
అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా చైన్ స్నాచింగ్ వంటి నేరాలను అరికట్టవచ్చని పోలీసులు సూచించారు.

## ఎన్టీఆర్ జిల్లా ఐ.టి.ఐ లలో రెండవ విడత అడ్మిషన్లు..

**- జిల్లా కన్వీనర్ ఎం. కనకారావు**




**విజయవాడ,29.07.2026.**
ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని ఐ.టి.ఐ లలో 2026-27/28 విద్యా సంవత్సరానికి గాను రెండవ విడత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ మరియు జిల్లా కన్వీనర్ ఎం. కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ల కొరకు అర్హులైన అభ్యర్థులు ఆగస్టు 3వ తేదీ లోగా ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు ఆగస్టు 6వ తేదీన విజయవాడలోని ప్రభుత్వ ఐ.టి.ఐ ప్రాంగణంలో అడ్మిషన్ల కౌన్సిలింగ్ నిర్వహించబడుతుందని తెలిపారు.అభ్యర్థులు తమ మెరిట్ నంబర్ ఆధారంగా నిర్ణీత తేదీన తమ ఒరిజినల్ సర్టిఫికేట్లతో కౌన్సిలింగ్‌కు హాజరుకావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఐ.టి.ఐ లలో ప్రవేశం పొందే వారిలో ఎస్.సి., ఎస్.టి. అభ్యర్థులు మినహా మిగిలిన కేటగిరీల అభ్యర్థులు రూ. 60/- కాషన్ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని, ప్రైవేటు ఐ.టి.ఐ లలో చేరే అభ్యర్థులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫీజు చెల్లించాలని తెలిపారు. అభ్యర్థులు తమ మెరిట్ నంబర్ సమాచారం కోసం విజయవాడ ప్రభుత్వ ఐ.టి.ఐ లోని జిల్లా కన్వీనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను సంప్రదించవచ్చునన్నారు.
ఇతర వివరాలకు 0866-2475575, 94906 39639, లేదా 77804 29468 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని కన్వీనర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# విత్తనం నాటిన ప్రతి రైతుకు ఫసల్ బీమా..!

**- రైతుల ఆర్థిక భద్రతకు పథకంలో 100 శాతం నమోదు అవసరం..**
**- ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలి**
**- సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో జిల్లాను ముందంజలో నిలపాలి**
**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**ఎన్టీఆర్ జిల్లా --విజయవాడతేదీ: జులై 29, 2026**
జిల్లాలో రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, ప్రజారోగ్యం, వరదల నివారణ, రెవెన్యూ సేవలు, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాల్లో నిర్దేశించిన లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, జిల్లాస్థాయి అధికారులతో కలసి కలెక్టర్ కార్యాలయం నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన కింద విత్తనం నాటిన ప్రతి రైతును తప్పనిసరిగా పంటల బీమా పరిధిలోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. జిల్లాలో 100 శాతం నమోదు లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. పంట మార్పిడి (క్రాప్ డైవర్సిఫికేషన్)పై ప్రతి మండల వ్యవసాయ అధికారి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని, ఇప్పటి వరకు ఎంతమంది రైతులు ఎంత విస్తీర్ణంలో పంట మార్పిడి చేపట్టారో సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలన్నారు. జిల్లాలో ఎరువుల లభ్యత, పంపిణీపై ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారులు ప్రతిరోజూ కనీసం రెండు నుంచి మూడు ఎరువుల దుకాణాలను తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. రైతులకు సమస్యలు ఎదురైతే కలెక్టరేట్ యూనిఫైడ్ కాల్ సెంటర్ (91549 70454)ను సంప్రదించే విధంగా అన్ని ఎరువుల దుకాణాల వద్ద హెల్ప్‌లైన్ నంబర్‌ను స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు. వర్షాలు ఆలస్యమైన పరిస్థితుల్లో సీడ్ పెల్లెటింగ్‌ను ప్రతి రైతుకు విస్తృతంగా అమలు చేయాలని, ఇది కేవలం ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు మాత్రమే కాకుండా అందరికీ వర్తించే సాంకేతిక విధానమని వివరించారు. సీడ్ పెల్లెటింగ్ వల్ల మొలక శాతం మెరుగుపడటంతో పాటు తక్కువ వర్షపాతం పరిస్థితుల్లో కూడా త్తనం సురక్షితంగా ఉంటుందని తెలిపారు. రైతులకు అవసరమైన శిక్షణ అందించాలని ఆదేశించారు.హరిత విస్తీర్ణంపై దృష్టిపెట్టండి: నెట్ జీరో' లక్ష్య సాధనలో భాగంగా జిల్లాలో విస్తృత స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. మొదట సోషల్ వెల్ఫేర్ పాఠశాలలు, హాస్టళ్లలో ప్రారంభించి అనంతరం అన్ని విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు విస్తరించాలని సూచించారు. గ్రామపంచాయతీలు, పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న స్థలాలను హరితవనాలుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. జిల్లా యంత్రాంగం మొత్తం ఒకే బృందంలా పనిచేయాలని, అధికారులు తమ శాఖలకే పరిమితం కాకుండా జిల్లా అభివృద్ధి లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని సమన్వయంతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలులో జిల్లాను ముందు వరుసలో నిలపడానికి కృషి చేయాలని కలెక్టర్ లక్ష్మీశ దిశానిర్దేశం చేశారు. వరద పరిస్థితులను ఎదుర్కొనేందుకు సన్నద్ధత, 22ఏ దరఖాస్తుల పరిష్కారం తదితరాల పైనా కలెక్టర్ అధికారులకు సూచనలు చేశారు.

# శాస్త్రోక్తంగా జీయంగార్ల చాతుర్మాస దీక్ష సంకల్పం




**తిరుమల జూలై 29 :** తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం ఉదయం శ్రీశ్రీశ్రీ పెద్దజీయంగారి చాతుర్మాస దీక్ష సంకల్పం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. శ్రీ వైష్ణవ సంప్రదాయకర్త శ్రీ రామానుజాచార్యుల పారంపర్యంలో చాతుర్మాస దీక్ష విశేషమైంది. ఆషాడ శుద్ధ ఏకాదశి రోజున శ్రీమహావిష్ణువు యోగ నిద్రలోకి వెళ్లి తిరిగి కార్తీక శుద్ధ ఏకాదశి రోజున మేల్కొంటారని ప్రాశస్త్యం.కావున ఈ నాలుగు నెలల కాలాన్ని చాతుర్మాస్యం అంటారు. చాతుర్మాస వ్రతం ప్రాచీనకాలం నుండి ఆచరణలో ఉన్నట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది.ముందుగా శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి మఠంలో కలశ స్థాపన, కలశ పూజ,విష్వక్సేనారాధన, మేదినిపూజ, మృత్సంగ్రహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.తరువాత సేకరించిన పుట్ట మన్నుకు ప్రత్యేక పూజలు నిర్వహించి చాతుర్మాస సంకల్పం స్వీకరించారు. అనంతరం శ్రీ పెద్దజీయంగారు తిరుమల బేడి ఆంజనేయస్వామివారి ఆలయం పక్కనగల జీయ్యంగారి మఠం వద్ద నుండి శ్రీ చిన్నజీయంగారు మరియు ఇతర శిష్యబృందంతో బయల్దేరారు. తిరుమల క్షేత్ర సంప్రదాయాన్ని పాటిస్తూ స్వామి పుష్కరిణి, శ్రీ వరాహస్వామివారిని దర్శించుకున్నారు. అక్కడినుంచి మంగళవాయిద్యాలతో శ్రీవారి ఆలయానికి విచ్చేశారు.శ్రీవారి ఆలయ మహాద్వారం చెంత టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, ఇతర ఆలయ అధికారులతో కలిసి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. శ్రీ జీయంగార్లు శ్రీవారిని దర్శించుకున్న తరువాత శ్రీ పెద్దజీయంగారికి మేల్‌చాట్ వస్త్రాన్ని, శ్రీ చిన్నజీయంగారికి నూలుచాట్ వస్త్రాన్ని బహూకరించారు.అనంతరం శ్రీపెద్దజీయర్ మఠంలో పెద్దజీయర్‌స్వామి,చిన్నజీయర్‌స్వామి కలిసి ఈవో,బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి,ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం,పేష్కార్ శ్రీ రామ కృష్ణ, నాసన్మానించారు.

# మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్



**ఆదోని జూలై 29 :** మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి నారా లోకేష్‌ను కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మర్యాదపూర్వకంగా కలిశారు.బుధవారం సాయంత్రం ఆదోని పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు మంత్రి నారా లోకేష్ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంత్రి లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కొద్దిసేపు వారితో మాట్లాడారు.

# నేడు వేములలో పంచాయతీ అభివృద్ధికి దిశానిర్దేశం

**మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 9.30 గంటల నుంచి జీపిడీపీపై శిక్షణ**

**వేముల మండలం ఎంపీడీఓ శారదమ్మ ప్రకటన**



**వేముల జూలై 29 :**వేముల మండలంలోని గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి దోహదపడేలా గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపిడీపీ)పై నేడు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల ఎంపీడీఓ శారదమ్మ గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. అందులో భాగంగా ఆమె మాట్లాడుతూ...ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థ కమిషనర్, జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ఆదేశాల మేరకు వేముల మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అనగా నేడు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు.గ్రామాల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికల రూపకల్పన, పంచాయతీల పనితీరు మెరుగుదల, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాల అమలు వంటి అంశాలపై శిక్షణలో అవగాహన కల్పించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.ఈ కార్యక్రమానికి మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు,జడ్పీటీసీ,ఎంపీటీసీ సభ్యులు,గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు,పంచాయతీ కార్యదర్శులు,మండల స్థాయి అధికారులు,డిజిటల్ సహాయకులు,ఇంజనీరింగ్ సహాయకులు,ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఒక స్వయం సహాయక సంఘం అనిమేటర్ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు తీసుకుని అందరూ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యేలా చూడాలని ఎంపీడీవో శారదమ్మ సూచించారు.శిక్షణకు హాజరయ్యే వారికి మధ్యాహ్న భోజన సదుపాయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిబ్బందికి ఆదేశించారు.

# కల్తీ మాంసం విక్రయిస్తే క్రిమినల్ చర్యలు తప్పవు: వేంపల్లె ఈఓ గాండ్ల కవిత



**వేంపల్లె జూలై 29:** వేంపల్లి లో వినియో గదారులకు కల్తీ మాంసం విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని గ్రామ పంచాయతీ ఈవో గాండ్ల కవిత మాంసం విక్రయదారులకు హెచ్చరించారు. స్థానిక తిరుమల థియేటర్ వద్ద ఉన్న మటన్ మార్కెట్ లో ఓ వ్యక్తి చనిపోయిన పొట్టేలు మాంసం విక్రయిస్తున్నారని స్థానికులు గ్రామపంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి వెంకటసుబ్బయ్య డిప్యూటీ ఎంపీడీవో రమణయ్య ఆదేశాల మేరకు ఈవో కవిత తమ సిబ్బందిచే సదరు మటన్ దుకాణాలపై దాడులు నిర్వహించారు. కిలో మాంసం రూ 850 కి విక్రయిస్తూ ప్రజలకు నాసిరకం మాంసం విక్రయించడం అన్యాయమన్నారు. ఇకపై వినియోగదారులకు గొర్రెలను కానీ చనిపోయిన జీవాల మాంసం విక్రయిస్తే కేసులు తప్పవన్నారు. ఇకపై తరచూ దాడులు నిర్వహిస్తూనే ఉంటామని ఆమె పేర్కొన్నారు. వినియోగదారులకు నాణ్యమైన మాంసాన్ని విక్రయించాలన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ

# జిల్లా ఆర్థికాభివృద్ధికి జివిఏ--జిడిడిపిపై సమగ్ర అవగాహన అవసరం: జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

- **స్వర్ణ ఆంధ్ర ఏ2047 లక్ష్యాలకు నాణ్యమైన గణాంకాలే పునాది**
- **మండల స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు జివిఏ--జిడిడిపిపై అవగాహన పెంపొందించాలి**
- **శిక్షణలో పాల్గొన్న అధికారులు మాస్టర్ ట్రైనర్లుగా వ్యవహరించాలి**






**విజయవాడ: జూలై 29,2026.**
జిల్లా ఆర్థికాభివృద్ధి వేగవంతం కావాలంటే స్థూల విలువ జోడింపు, స్థూల జిల్లా దేశీయోత్పత్తి వంటి ఆర్థిక సూచికలపై ప్రతి శాఖకు సమగ్ర అవగాహన ఉండాలని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ పేర్కొన్నారు. విజయవాడ కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన సామర్థ్య పెంపు శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అధికారులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ శిక్షణలో జిల్లా ఆర్థికాభివృద్ధి, జివిఏ, జిడిడిపి, రంగాల వారీ ఆర్థిక వృద్ధి, జిల్లా, మండల స్థాయిలో ఆర్థిక గణాంకాల తయారీ, విశ్లేషణ తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్లైన మండల స్థాయి అధికారులు, సీపీఓ యూనిట్, యంగ్ ప్రొఫెషనల్స్‌కు సమగ్ర అవగాహన కల్పించారు. 2025--26 సంవత్సరానికి జిల్లా జిడిడిపి సుమారు రూ.1,05,135 కోట్లుగా నమోదైందని కలెక్టర్ తెలిపారు. జిల్లా అభివృద్ధి ప్రగతిని అంచనా వేయడంలో జివిఏ, జిడిడిపి వంటి ఆర్థిక సూచికలు కీలకమని పేర్కొన్నారు. ప్రతి శాఖ జివిఏ లెక్కింపు విధానాలు, రంగాల వారీ వృద్ధి, గణాంకాల వినియోగంపై పూర్తి అవగాహనతో పనిచేయాలని సూచించారు. దేశం 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవాలంటే నూరు శాతం అక్షరాస్యత సాధించడం అత్యవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. అక్షరాస్యతతో పాటు నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత కల్పిస్తే దాదాపు 95 శాతం ప్రజలను పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో తీర్చిదిద్దే అవకాశం ఉంటుందన్నారు. మహిళలు సంపూర్ణ నైపుణ్యాలను సొంతం చేసుకున్నప్పుడే కుటుంబాలతో పాటు రాష్ట్ర, దేశ ఆర్థికాభివృద్ధికి బలమైన ఆధారంగా నిలుస్తారని తెలిపారు. నైపుణ్య విద్య ద్వారా ఉపాధి అవకాశాలు విస్తరించి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని వివరించారు. వ్యవసాయ రంగంలో సంప్రదాయ పంటలతో పాటు విలువ ఆధారిత వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. వరి సాగులోని కొంత భూమిని ఉద్యానవన పంటలకు మళ్లించడం ద్వారా రైతుల ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం ఉందన్నారు. విజయవాడ ఉత్సవాలను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా సేవారంగంలో సుమారు రూ.150 కోట్ల అదనపు స్థూల విలువ జోడింపును సాధించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధితో సేవారంగం మరింత బలోపేతమవుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని సహజ, మానవ వనరులు, భౌగోళిక అనుకూలతలను సమర్థవంతంగా వినియోగించుకొని అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయంలో ఉత్పత్తి పెంపుతో పాటు విలువ ఆధారిత ఉత్పత్తులపై దృష్టి పెట్టాలని, సేవా, పారిశ్రామిక రంగాల విస్తరణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాలను కేవలం సైద్ధాంతిక అంశాలకు పరిమితం చేయకుండా పరస్పర చర్చలు, ప్రశ్నోత్తరాలు, ఆచరణాత్మక ఉదాహరణలతో నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను మండల స్థాయి అధికారులు, ముఖ్యంగా పంచాయతీ కార్యదర్శులు, స్వర్ణ గ్రామ--స్వర్ణ వార్డు సిబ్బందికి సమర్థవంతంగా చేరవేయాలని ఆదేశించారు. శిక్షణలో పాల్గొన్న అధికారులు మాస్టర్ ట్రైనర్లుగా వ్యవహరించి జివిఏ, జీఎన్‌డీపీ, జిడిడిపి, జీఎస్‌డీపీ వంటి ఆర్థిక భావనలపై క్షేత్రస్థాయి వరకు అవగాహన కల్పించాలని తెలిపారు. అభివృద్ధి ప్రణాళికల అమలులో భాగస్వాములైన ప్రతి స్థాయి అధికారి, సిబ్బందికి ఈ అంశాలపై ప్రాథమిక పరిజ్ఞానం ఉండటం అవసరమని పేర్కొన్నారు. జిల్లా ఆర్థికాభివృద్ధికి సంబంధించిన గణాంకాల సేకరణ, విశ్లేషణ, వినియోగంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. విశ్వసనీయ గణాంకాల ఆధారంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి సమిష్టి కృషితో జిల్లా అభివృద్ధిని మరింత వేగవంతం చేసి స్వర్ణ ఆంధ్ర ఏ2047 లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు.
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థిక ఉ గణాంక శాఖ జాయింట్ డైరెక్టర్ బి.అనుపమ మాట్లాడుతూ, ప్రతి శాఖ తన పరిధిలోని గణాంక సమాచారాన్ని ఖచ్చితత్వంతో, పారదర్శకతతో, నిర్ణీత గడువులో అందించాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేసి విశ్వసనీయ గణాంకాల ఆధారంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని తెలిపారు. స్వర్ణ ఆంధ్ర ఏ2047 లక్ష్యాల సాధనలో నాణ్యమైన, విశ్వసనీయ, సమయానుకూల గణాంకాలే విజయానికి పునాది అని పేర్కొన్నారు. మండల, నియోజకవర్గ స్థాయిలలో రంగాల వారీ జివిఏ పురోగతిని కీలక పనితీరు సూచికల ద్వారా నిరంతరం పర్యవేక్షించి అవసరమైన చోట సకాలంలో చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పహాలే ఇండియా ఫౌండేషన్ శిక్షకులు జె.అనిల్ కుమార్, బెల్లపు రాగిణి, జోనల్ కోఆర్డినేటర్ యోగేష్ కృష్ణ, జిల్లా విశ్లేషకులు, మండల స్థాయి అధికారులు, సీపీఓ యూనిట్ సభ్యులు, యంగ్ ప్రొఫెషనల్స్ పాల్గొన్నారు

# ప్రజల జీవన ప్రమాణాలు పెంచే విధంగా సమగ్ర అభివృద్ధి కార్యాచరణ చేపట్టాలి: జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.



**కర్నూలు జూలై 29 :**ప్రజల జీవన ప్రమాణాలు పెంచే విధంగా సమగ్ర అభివృద్ధి కార్యాచరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి నియోజకవర్గ ప్రత్యేక అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో స్వర్ణాంధ్ర ఏ 2047 లో భాగంగా వివిధ శాఖల స్థూల జిల్లా దేశీయోత్పత్తి (జి.డి.డి.పి)పై సామర్థ్య పెంపు శిక్షణ కార్యక్రమానికి సంబంధించి నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు అమలు చేయనున్న కార్యాచరణ ప్రణాళిక (ఆక్షన్ ప్లాన్) పై జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థిక మరియు గణాంకాల డైరెక్టర్ బి.గోపాల్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గం యొక్క స్థానిక వనరులు, ప్రత్యేకతలు మరియు అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని కలెక్టర్ నియోజకవర్గ ప్రత్యేక అధికారులను ఆదేశించారు.వీటితో పాటు స్వల్పకాలిక ప్రయోజనకరమైన కార్యక్రమాలపై కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. తక్కువ నీటితో వరి సాగు చేసే ఆధునిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించి, వాటిని విస్తృతంగా ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో నీటి కొరత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో వరి సాగు కంటే ఉద్యాన పంటల సాగుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ తెలిపారు.
ముఖ్యంగా ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం తదితర ప్రాంతాల్లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని మామిడి, జామ, దానిమ్మ, సపోటా వంటి అధిక ఆదాయం అందించే వాణిజ్య పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.. పశువుల పెంపకానికి సంబంధించిన రుణాలను త్వరితగతిన ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.. ప్రతి డివిజన్‌లో స్థానిక వనరులు, వ్యవసాయ అవకాశాలు, ప్రత్యేకతలను గుర్తించి, ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరే అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిపాదించాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. విండ్ పవర్, సోలార్ పవర్ రంగాల్లో ఉన్న అవకాశాలను మరింత విస్తరించేందుకు కొత్త కంపెనీలను ఆకర్షించే దిశగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి శాఖ తన పరిధిలోని అభివృద్ధి పనులపై స్పష్టమైన ప్రణాళికలు సిద్ధం చేసి ప్రతిపాదనలు అందించాలని, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు శాఖలతో నిరంతరం సమన్వయం చేస్తూ ప్రతిపాదనలను వేగంగా సిద్ధం చేయించాలన్నారు. పత్తి సాగు చేస్తున్న ప్రతి రైతు క్లస్టర్ బీన్ (గోరుచిక్కుడు), కంది, జొన్న, సజ్జ, బెండ వంటి పంటల్లో కనీసం రెండు పంటలను అంతర పంటలుగా సాగు చేసేలా ప్రోత్సహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.స్కిల్ డెవలప్మెంట్ కు సంబంధించి 5 కోర్సు లను గుర్తించి వాటిని కూడా ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

# మంత్రి నారా లోకేష్ పత్తికొండ పర్యటనపై సీపీఎం బహిరంగ లేఖ

**● సోలార్ భూ లీజు గడువు తగ్గించాలి.. ● సాగునీరు రహదారుల సమస్యలు పరిష్కరించాలి**

**పత్తికొండ జూలై 29 :**రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పత్తికొండ పర్యటన సందర్భంగా నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాల ని కోరుతూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో బహిరంగ లేఖ విడుదల చేశారు. పత్తికొండ ప్రాంత అభివృద్ధికి సంబంధించిన పలు కీలక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.హోసూరు గ్రామంలో టాటా పవర్ సోలార్ ప్రాజెక్టు కోసం తీసుకున్న భూముల లీజు ఒప్పందాన్ని 30 సంవత్సరాల నుంచి 5 సంవత్సరాలకు తగ్గించాలని, రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున లీజు చెల్లించాలని డిమాండ్ చేశారు.అలాగే హంద్రీ కాలువకు హోసూరు సమీపంలో స్లూయిజ్ ఏర్పాటు చేసి సాగునీరు అందించాలని కోరారు. హంద్రీనీవా కాలువల నుంచి పెద్దహుల్తి, చిన్నహుల్తి, జూటూరు, దూదేకొండ, కోతిరాళ్ల గ్రామాలకు పంట కాలువల ద్వారా సాగునీరు, తాగునీరు అందించే చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.టమోటా రైతుల ప్రయోజనాల కోసం నిర్మాణంలో ఉన్న టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని, పత్తికొండ నియోజకవర్గ కేంద్రంలోని రోడ్లను విస్తరించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోనే పత్తికొండ ప్రాంతం నిత్యం కరువుకు నిలయంగా ఉందని, ఇలాంటి ప్రాంత అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి, ప్రస్తుతం విద్యాశాఖ మంత్రి పర్యటనలు జరుగుతున్నప్పటికీ పత్తికొండ అభివృద్ధికి సంబంధించిన సమస్యలపై స్పష్టమైన హామీలు రావడం లేదని విమర్శించారు.హోసూరు గ్రామంలో దాదాపు 1800 ఎకరాల్లో నిర్మిస్తున్న టాటా పవర్ సోలార్ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమానికి మంత్రి నారా లోకేష్ హాజరవుతున్న నేపథ్యంలో, ఈ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్తున్నామని, వాటి పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇవ్వాలని సీపీఎం నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.ఎస్. రాధాకృష్ణ, మండల కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, నాయకులు రంగారెడ్డి, వెంకటేశులు, గోపాల్, రామాంజనేయులు, సురేంద్ర, సిద్ధాగౌడ్, ప్రజాసంఘాల నాయకులు ఎం. రవిచంద్ర, ఉశేని, దుర్గా తదితరులు పాల్గొన్నారు.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..